సాక్షి అనకాపల్లి

సోమవారం, 14, జూలై, 2025



'ఇసుక దందా'పై దాడులు

'హోం మంత్రి ఇలాకాలో.. ఆగని ఇసుక దందా'శీర్షికన సాక్షిలో ఇటీవల ప్రచురితమైన కథనానికి అధికారులు స్పందించారు. 8లో



ఉపాధి @ ఐటీఐ

ప్రభుత్వ పారిశ్రామిక శిక్షణ సంస్థ(ఐటీఐ)ల్లో శిక్షణ పొందుతున్న విద్యార్థులకు ఉపాధి అవకాశాలు మెండుగా లభిస్తున్నాయి. 8లో



'కోట'మెచ్చిన విశాఖ 8లో

న్యూస్‌రీల్

నేడు కలెక్టరేట్‌లో పీజీఆర్‌ఎస్

- ఆన్‌లైన్‌లోను ఫిర్యాదులు చేసుకోవచ్చు..

తుమ్మపాల : ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమం సోమవారం కలెక్టరేట్‌లో నిర్వహించనున్నట్టు కలెక్టర్ విజయ కృష్ణన్ తెలిపారు. ప్రతి సోమవారం నిర్వహించే పీజీఆర్‌ఎస్ కార్యక్రమం కలెక్టరేట్‌తో పాటు, డివిజనల్, అన్ని మండల కార్యాలయాల్లో నిర్వహించడం జరుగుతున్నందున ప్రజలు మండల స్థాయిలో కూడా ఫిర్యాదులు చేయవచ్చన్నారు. కార్యాలయాలకు వచ్చి నేరుగా ఫిర్యాదులు చేయలేని వారు ఆన్‌లైన్‌లో meekoram.ap.gov.in వెబ్‌సైట్‌లో నమోదు చేసుకునే అవకాశం ఉందన్నారు. అర్జీల సమాచారం కోసం టోల్ ఫ్రీ నెం .1100కు కాల్ చేసి ఫిర్యాదు స్థితిని తెలుసుకోవచ్చని తెలిపారు.

కోయభాష దినోత్సవాన్ని ప్రభుత్వమే నిర్వహించాలి



విద్యార్థులకు కోయభాష పద్యాల గురించి వివరిస్తున్న పరిషత్ నాయకులు

చింతూరు: విశ్వ కోయభాష దినోత్సవాన్ని ప్రభుత్వమే ఘనంగా నిర్వహించాలని ఆదివాసీ సంక్షేమ పరిషత్ రాష్ట్ర ప్రచార కార్యదర్శి సోడె మురళి డిమాండ్ చేశారు. ఆదివారం స్థానిక గురుకుల పాఠశాలలో పరిషత్, కోయ త్తోర్‌బాట ఆధ్వర్యంలో విద్యార్థులతో నిర్వహించిన కార్యక్రమంలో కోయ పద్యాల గురించి వివరించారు. ఈ సందర్భంగా మురళి మాట్లా డుతూ ఈనెల 21న జరిగే కోయభాష దినో త్సవాన్ని ప్రభుత్వం నిర్వహించాలని, రాజ్యాంగంలోని ఎనిమిదో షెడ్యూల్ ప్రకారం కోయభాషకు జాతీయ భాషగా గుర్తింపు కలిపించాలని, ప్రాథమిక స్థాయిలోనే మాతృభాషలో విద్యాబోధన జరిగేలా ప్రభుత్వం చర్యలు చేపట్టాలని కోరారు. రంపచోడవరం, చింతూరు డివిజన్లలో కోయభాష బోధించేందుకు వలంటీర్లను నియమించాలని, ఆదివాసీ పూజారు లకు గౌరవవేతనం అందించాలని ఆయన డిమాండ్ చేశారు.

రేపు పింఛనుదారుల ధర్నా

అనకాపల్లి : ఆల్ ఇండియా రాష్ట్ర ప్రభుత్వాల పెన్షనర్స్ ఫెడరేషన్ వారి పిలుపు మేరకు రాష్ట్ర ప్రభుత్వ పింఛనుదారుల సంఘం జిల్లా వారి ఆధ్వర్యంలో ఈనెల 15న స్థానిక నెహ్రూచౌక్ వద్ద ఉదయం 10 గంటలకు ధర్నా కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు సంఘం జిల్లా అధ్యక్షుడు వడ్డాది జగన్నాథరావు, కార్యదర్శి బి.ఎల్.ఎన్.శర్మలు ఆదివారం ఒక ప్రకటనలో అన్నారు. కేంద్ర ప్రభుత్వం ఆర్థిక బిల్లుతో పాటు ప్రవేశపెట్టిన వేలిడేషన్ అమెండ్‌మెంట్‌ను రద్దు చేయాలని, ఈ సవరణ అమలులోకి వస్తే కేంద్ర ప్రభుత్వం ఉద్యోగులు, పెన్షనర్లు మాత్రమే కాక రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులు, పెన్షనర్లు నష్టపోయే అవకాశం ఉందన్నారు. ఈ బిల్లును అమల్లోకి రాకుండా నిలువరించవలసిన అవసరం ఉందని పేర్కొన్నారు. కేంద్ర ప్రభుత్వం 8వ పే కమిషన్ వెంటనే నియమించాలని, మన రాష్ట్రంలో కూడా 12వ పే కమిషన్ వెంటనే నియమించి, ఐఆర్ ప్రకటించాలని ఆయన కోరారు. పెండింగ్‌లో ఉన్న డీఆర్ బకాయిలు చెల్లించాలని, ఉద్యోగ, పెన్షనర్లకు కాంప్రహెన్సివ్ హెల్త్ ఇన్సూరెన్స్ స్కీమును అమలు చేయాలని, రైల్వే, విమాన టికెట్లలో సీనియర్ సిటిజన్ రాయితీలను పునరుద్ధరించాలని, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ పింఛనుదారులకు కమ్యూటేషన్ రికవరీ కాలాన్ని 15 సంవత్సరాల కాలం నుంచి 11 సంవత్సరాలకు తగ్గించాలని, జిల్లాలో ప్రభుత్వ పింఛన్‌దారులు అందరూ ధర్నా కార్యక్రమంలో పాల్గొనాలని ఆయన కోరారు.



హక్కు పత్రాలు ఇస్తున్న అప్పటి ఎమ్మెల్యే గణేష్ (ఫైల్)

- హక్కుపత్రాలు ఇంకెప్పుడిస్తారు...!
- గ్యాప్ ఏరియా భూముల్లో సాగు చేసే గిరిజనుల గోడు పట్టించుకోని కూటమి ప్రభుత్వం
- గత ప్రభుత్వంలో 580 మందికి పైగా హక్కుపత్రాల పంపిణీ



డిసెంబరు 24న సుందరకోట గ్రామసభలో స్పీకరు అయ్యన్నను హక్కు పత్రాలు ఇవ్వాలని కోరుతున్న ఎంపీపీ లక్ష్మణమూర్తి

అధ్యక్షా... అప్పుడే మరిచారా...!

గత ఏడాది డిసెంబరు 24వ తేదీన స్పీకర్ చింతకాయల అయ్యన్నపాత్రుడు సుందరకోట పంచాయతీకి విచ్చేశారు. అక్కడ జరిగిన గ్రామసభలో అర్ధంతరంగా ఆగిపోయిన గిరిజనుల అటవీ హక్కుపత్రాల పంపిణీ విషయాన్ని ఎంపీపీ సాగిన లక్ష్మణమూర్తి స్పీకర్ వద్ద ప్రస్తావించారు. వాటితో పాటు సరుగుడు సుందరకోట పంచాయతీలో గ్యాప్ ఏరియా భూముల్లో చాలా మంది గిరిజనులు పోడు వ్యవసాయం చేసుకుంటున్నారని ఆ భూములు కూడా సర్వే చేసి వారికి కూడా హక్కు పత్రాలు ఇవ్వాలని ఎంపీపీ విజ్ఞప్తి చేశారు. దీనిపై పరిశీలన చేసి గిరిజనులకు హక్కు పత్రాలు పంపిణీ చేసేందుకు వెంటనే చర్యలు చేపడతానని స్పీకర్ హామీ ఇచ్చారు. స్వయంగా స్పీకర్ గ్రామసభలో చెప్పారు...కాబట్టి మనకు హక్కు పత్రాలు వచ్చేసినట్టే అని గిరిజనులు ఎంతో సంబర పడ్డారు...కానీ కాలం గడిచిపోయింది...యథావిధిగా ఈ హామీకి కూడా ఇప్పటి వరకూ అతీగతీ లేదు...

నాతవరం :

గిరిజనులు సాగుచేసే భూములకు పట్టాలు ఇవ్వడంలో కూటమి ప్రభుత్వం తీవ్ర జాప్యం చేస్తోంది. గత ప్రభుత్వం హయాంలో వందలాది మంది గిరిజనులకు అటవీ హక్కు పత్రాలు ఇవ్వగా, ఆ తరువాత వచ్చిన ఎన్నికల కోడ్ కారణంగా మిగిలిన రైతులకు పట్టాల పంపిణీ నిలిచిపోయింది. అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం గిరిజనుల గోడును పూర్తిగా పెడచెవిన పెట్టింది... వివరాలివి.

మండలంలో సరుగుడు, సుందరకోట పంచాయతీల్లో సుమారుగా 10వేల ఎకరాలకు పైగా గ్యాప్ ఏరియా భూమి ఉంది, బ్రిటిష్ హయంలో సైతం సర్వే చేయకపోవడంతో ఈ భూమి గ్యాప్ ఏరియా భూమిగా రెవెన్యూ రికార్డులో నమోదైంది. ఆయా భూముల్లో గిరిజనులు స్వాతంత్ర్యం నాటి నుంచి తుప్పలు రాళ్లు తొలగించి పోడు వ్యవసాయం చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారు. గిరిజనులు సాగు చేసుకునే అటవీ పోడు భూములకు వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయంలో సర్వే చేశారు.

పోడు వ్యవసాయం చేసుకునే వారిని గుర్తించి రెండు దఫాలుగా ప్రభుత్వ నిబంధనల ప్రకారం అర్హత ఉన్న గిరిజనులకు సుమారుగా 589 మందికి అప్పటి నర్సీపట్నం ఎమ్మెల్యే పెట్ల ఉమా శంకర్ గణేష్ చేతుల మీదుగా అటవీ హక్కు పత్రాలు పంపిణీ చేశారు. అన్ని అర్హతలు ఉండి సర్వే చేసిన మరో 300మంది పైగా గిరిజన రైతులకు హక్కు పత్రాలు ఇవ్వడానికి అధికారులు జాబితా సిద్ధం చేశారు. ఇంతలో సార్వత్రిక ఎన్నికల కోడ్ రావడంతో పట్టాల పంపిణీ ప్రక్రియ నిలిచిపోయింది. అనంతరం కూటమి ప్రభుత్వం రాకతో ఈ అంశాన్ని అధికారులు పక్కన పడేసారు. ఈ నేపథ్యంలో గత ఏడాది డిసెంబరు 24వ తేదీన స్పీకర్ చింతకాయల అయ్యన్నపాత్రుడు సుందరకోట పంచాయతీకి విచ్చేయగా, అక్కడ జరిగిన గ్రామసభలో ఎంపీపీ సాగిన లక్ష్మణమూర్తి గిరిజనులకు హక్కు పత్రాలు పంపిణీ చేయాలని విజ్ఞప్తి చేశారు. సరుగుడు సుందరకోట పంచాయతీలో గ్యాప్ ఏరియా భూముల్లో పోడు వ్యవసాయం చేసుకునే రైతులకు కూడా సర్వే చేసి హక్కు పత్రాలు ఇవ్వాలని కోరారు. దీనికి స్పీకర్ స్పందించి వెంటనే చర్యలు చేపడతానని హామీ ఇచ్చారు. ఈ మేరకు సుందరకోట పంచాయతీలో గల గ్యాప్ ఏరియా భూములను ఫిబ్రవరిలో కలెక్టరు విజయకృష్ణన్ పరిశీలించారు. గ్యాప్ ఏరియా భూములతో పాటు గిరిజనులు సాగు చేసుకుంటున్న పోడు భూములను సైతం నమోదు చేయాలని నర్సీపట్నం ఆర్డీవో వి.వి.రమణ, సర్వే అధికారులను ఆదేశించారు, గ్యాప్ ఏరియా సర్వే యుద్ధప్రతిపాదికన పూర్తి చేసి నివేదిక ఇవ్వాలని అధికారులకు అదేశించారు. ఈ సమయంలో కూడా స్థానిక ఎంపీటీసీ సభ్యుడు ఎంపీపీ లక్ష్మణమూర్తి కలెక్టర్‌ను కలిసి గిరిజనులు



గిరిజనులు సాగు చేస్తున్న గ్యాప్ ఏరియా భూములు

హక్కు పత్రాల కోసం విజ్ఞప్తి చేయగా, సర్వే పూర్తయ్యాక పట్టాలు పంపిణీ చేస్తామని కలెక్టర్ చెప్పారు. అయితే స్పీకర్, కలెక్టరు హామీ ఇచ్చిన నెలలు గడుస్తున్నా నేటికీ గిరిజనులకు ఎదురు చూపులు తప్పలేదు. హక్కు పత్రాల పంపిణీ జరగలేదు. సాక్షాత్తూ స్పీకర్ హామీ ఇచ్చినా నెరవేరకపోతే మా సమస్య ఇంకెవరికి చెప్పుకోవాలంటూ గిరిజనులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

నాడు ఆశలు నెరవేర్చారు...

గత వైఎస్సార్‌సీపీ హయంలో అటవీ హక్కు పత్రాలు పొందిన గిరిజనులందరికీ వైఎస్సార్ రైతు భరోసా పథకంలో పెట్టుబడి ఆర్థిక సాయం అందుకున్నారు, ఏళ్ల తరబడి గిరిజనులు సాగు చేసుకునే పోడు భూములకు అసలు పట్టాలు వస్తాయనే ఆశ గిరిజనులకు ఉండేది కాదు. అటువంటి దశలో వై.ఎస్.జగన్మోహన్‌రెడ్డి అదేశాల మేరకు అప్పటి ఎమ్మెల్యే ఉమాశంకర్ గణేష్ కృషితో పోడు భూములు సాగు చేసుకునే గిరిజనులకు నిబంధనల ప్రకారం పట్టాలు అందజేశారు. సరుగుడు, సుందరకోట పంచాయతీలో అసనగిరి, తొరడ, కొత్త దద్దుగుల, మాసంపల్లి , రామన్నపాలెం, అచ్చంపేట, యరకంపేట, రాజవరం, సిరిపురం, ముంతమామిడిలొద్దు, కొత్త లంకలు, బమ్మిడికలొద్దు, దద్దుగుల తదితర గ్రామాలు 1/70 యాక్టు పరిధిలో ఉన్నాయి. ఆ గ్రామాల గిరిజనులు గ్యాప్ ఏరియా భూముల్లో పోడు వ్యవసాయం చేసుకుంటారు. మొదట తరం గిరిజనులు కాలం చేసేయడంతో వారు వారసులు అయా భూములు సాగు చేస్తున్నారు. మేము ఉండగా హక్కు పత్రాలు ఇస్తారా...అంటూ గిరిజన పెద్దలు మదన పడుతున్నారు.

384 మందిని గుర్తించాం.



పోడు వ్యవసాయం చేస్తున్న గిరిజనులను నిబంధనలు ప్రకారం 384 మందిని గుర్తించాం. ఆ జాబితా అటవీశాఖ అధికారులకు పాడేరు ఐటీడీఏకు నివేదించాం. అటవీశాఖ అధికారులు ఆమోదం తెలిపాక పాడేరు ఐటీడీఏ ద్వారా పాసుపుస్తకాలు వస్తాయి. రెవెన్యూ శాఖ పరంగా మేము జాప్యం చేయలేదు. అటవీశాఖలో జాప్యం జరుగుతున్నట్టుగా తెలుస్తుంది. గిరిజనులకు మేలు కోసం మా పని సకాలంలోనే చేసేయడం జరిగింది,

–ఎ.వేణుగోపాల్, తహసీల్దార్, నాతవరం మండలం

గతంలో రైతు భరోసా అందింది



మాకు పట్టాలు పాసుపుస్తకాలు వస్తాయి అనుకోలేదు. అలాంటిది వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో అటవీ హక్కు పత్రాలు ఇచ్చారు. హక్కు పత్రాలు పొందిన గిరిజనులందరికీ రైతు భరోసా పథకంలో పెట్టుబడి సాయం డబ్బులు ఇచ్చారు. కూటమి ప్రభుత్వంలో ఇంకా రైతు భరోసా డబ్బులు ఇవ్వలేదు.

–బండి గంగరాజు, సరుగుడు గ్రామం

గిరిజనులపై వివక్ష



కూటమి ప్రభుత్వంలో గిరిజనులు తీవ్ర వివక్ష ఎదుర్కొంటున్నారు. అధిక శాతం గిరిజనులు వైఎస్సార్‌సీపీకి చెందిన ప్రజాప్రతినిధులు ఓటర్లు ఉన్నారు. దానిని దృష్టిలో పెట్టుకుని కూటమి నేతలు గిరిజనుల సంక్షేమాన్ని విస్మరిస్తున్నారు. హక్కు పత్రాల కోసం స్వయంగా గ్రామసభలో అందరి సమక్షంలోనే స్పీకరు అయ్యన్నపాత్రుడు దృష్టికి, తర్వాత ఈ ప్రాంతానికి వచ్చిన కలెక్టరు విజయకృష్ణన్‌కు ఈ సమస్య తీసుకెళ్లాను, త్వరలోనే పరిష్కరిస్తాను అన్నారు కానీ నేటికీ జరగలేదు.

–సాగిన లక్ష్మణమూర్తి, ఎంపీపీ

బిల్లులు, వేతనాలు అందకే అసంతృప్తి

- మాజీ సీఎం వై.ఎస్.జగన్‌మోహన్ రెడ్డి నాయకత్వంలో పనిచేస్తాం
- జెడ్పీటీసీల సమస్యల పరిష్కారానికి కృషి
- మీడియాతో జెడ్పీ ఛైర్‌పర్సన్ సుభద్ర



మహారాణిపేట: జిల్లా పరిషత్ జనరల్ ఫండ్స్ నుంచి గత 12 నెలలుగా అభివృద్ధి పనుల బిల్లులు విడుదల కాకపోవడం, అలాగే జెడ్పీటీసీలకు చాలా నెలల నుంచి గౌరవ వేతనం రాకపోవడం వంటి సమస్యలపై జెడ్పీటీసీలు అసంతృప్తితో ఉన్నారని జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ జె. సుభద్ర తెలిపారు. ఆదివారం సాయంత్రం జెడ్పీ బంగ్లాలో మీడియా సమావేశంలో మాట్లాడారు. గత ఏడాది నుంచి దాదాపు రూ. 8.5 కోట్ల బిల్లులు సీఎఫ్‌ఎంఎస్ ద్వారా విడుదల కావాల్సి ఉందని చైర్‌పర్సన్ తెలిపారు. ఈ ఏడాది జూన్ చివరి వరకు పూర్తయిన పనులకు ఎలాంటి బిల్లులు మంజూరు కాలేదన్నారు. ఈ బిల్లులు ఎప్పుడు మంజూర వుతాయో తెలియని పరిస్థితి ఉండడంతో సభ్యులు ఆవేదన చెందుతున్నారని చెప్పారు. జెడ్పీటీసీల గౌరవ వేతనం కూడా పెండింగ్‌లో ఉండటం అసంతృప్తికి మరో ప్రధాన కారణమని వివరించారు.

జగన్ నాయకత్వంలోనే పనిచేస్తాం

జిల్లా పరిషత్ ప్రాదేశిక సభ్యులందరూ కలిసి చర్చించుకున్నారని, తమలో ఎలాంటి అసంతృప్తులు లేవని జె. సుభద్ర స్పష్టం చేశారు. వారంతా మాజీ ముఖ్యమంత్రి, వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు వై.ఎస్. జగన్ మోహన్ రెడ్డి నాయకత్వంలోనే పని చేసేందుకు ఎంతో ఉత్సాహంగా ఉన్నారన్నారు. సమన్వయ లోపం వల్ల చిన్నపాటి సమస్యలు ఉత్పన్నమైనా, వాటిని చర్చల ద్వారా పరిష్కరించుకుంటామన్నారు. ఈ సమస్యల గురించి పార్టీ నాయకులకు అన్ని విషయాలను కూలంకషంగా వివరించినట్లు తెలిపారు. శాసనమండలి ప్రతిపక్ష నేత బొత్స సత్యనారాయణ, ఇతర నాయకులు ఈ విషయాన్ని పార్టీ అధినాయకత్వం, ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి త్వరగా బిల్లులు చెల్లించే విధంగా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారని సుభద్ర పేర్కొన్నారు. ఈ సమస్య రాష్ట్రంలోని అన్ని జిల్లాల్లోనూ ఉంది ని జెడ్పీటీసీలకు వివరించడంతో వారిలో ఉన్న అపోహలు తొలగాయని ఆమె చెప్పారు. పార్టీ సూచనల మేరకు శాసన మండలి ప్రతిపక్ష నాయకులు బొత్స సత్యనారాయణ, ఇతర సీనియర్ నాయకులు, మాజీ మంత్రులు, మాజీ ఎమ్మెల్యేలు ప్రతి జెడ్పీటీసీతో వ్యక్తిగతంగా మాట్లాడినట్లు తెలిపారు. ఈ సమావేశం అనంతరం, జెడ్పీటీసీలు చైర్‌పర్సన్‌కు పూర్తి సహకారం అందిస్తామని హామీ ఇచ్చినట్టు సుభద్ర పేర్కొన్నారు. పెండింగ్‌లో ఉన్న విషయాలను కలెక్టర్ ద్వారా ప్రభుత్వానికి నివేదిస్తామని తెలిపారు.

జీ కోడూరు క్వారీ లీజు రద్దు చేయాలి



ఆందోళన చేస్తున్న చిరంజీవి తదితరులు

మాకవరపాలెం: పంటలకు నష్టం కలిగించే క్వారీ లీజును రద్దు చేయాలని కులవ్యతిరేక పోరాట సంఘం(కేవీపీఎస్) జిల్లా ప్రధాన కార్యదర్శి ఈరెల్లి చిరంజీవి డిమాండ్ చేశారు. కేవీపీఎస్ ఆధ్వర్యంలో జీకోడూరులో ఆదివారం రాత్రి ఆందోళన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జీకోడూరు రెవెన్యూలోని 332 సర్వే నంబర్‌లో 24 హెక్టార్లలో నల్లరాతి క్వారీ నిర్వహణకు లీజులు ఇచ్చారన్నారు. ఈ క్వారీ కారణంగా పక్కనే ఉన్న దళితుల భూములకు నష్టం వాటిల్లుతుందని తెలిపారు. క్వారీని నిర్వహించొద్దని ఇక్కడి దళిత రైతులు ఆందోళనలు చేసినా అధికారులు పట్టించుకోవడం లేదని ఆరోపించారు. వారంతా శాంతియుతంగా నిరసన తెలిపేందుకు క్వారీ వద్ద వేసుకున్న పాకను ఈ తెల్లవారుజామున గుర్తు తెలియని వ్యక్తులు కూల్చివేశారని, దీనిపై విచారణ చేసి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

నిండు గర్భిణికి తప్పని డోలీమోత

- ఆలస్యంగా వచ్చిన అంబులెన్స్
- మార్గంలో తుప్పల్లోనే ప్రసవించిన గర్భిణి



లోసింగి నుంచి గర్భిణిని డోలీమోతతో తీసుకొస్తున్న కుటుంబీకులు

రోలుగుంట : మండలంలో గిరిజన గ్రామాలకు రహదారి సమస్య తీరక రవాణా సమస్యతో అర్ల గ్రామం నుంచి దిగువకు ఆస్పత్రికి డోలీమోతతో తీసుకొస్తున్న గర్భిణి మార్గంలోనే ప్రసవించిన సంఘటన ఆదివారం జరిగింది. అర్ల గ్రామానికి చెందిన పాంగి సాయికి నెలలు నిండి నొప్పులు రావడంతో ఆమె భర్త సుందర్రావు అంబులెన్స్‌కు సమాచారం ఇచ్చి కుటుంబ సభ్యులతో కలిసి భార్యను కొండ డిగువకు డోలీమోతతో నాలుగు కిలోమీటర్లు వై.బీ.పట్నం రోడ్డు వరకూ మోసుకుని వచ్చారు. అంబులెన్సు రావడం ఆలస్యం కావడంతో తోటి మహిళలు మార్గంలో తుప్పల్లోకి తీసుకెళ్లగా అక్కడే ప్రసవం జరిగింది. తరువాత అంబులెన్సు రావడంతో ఆమె బంధువులు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. దీనిపై సీపీఎం జిల్లా కార్యవర్గ సభ్యుడు కె.గోవిందరావు మాట్లాడుతూ గిరిజనుల సమస్య పరిష్కారంలో తగిన చర్యలు తీసుకోని ప్రభుత్వ తీరును ఎండగట్టారు. లోసింగి, పెదగరువు , పీత్రుగెడ్డ తదితర గ్రామాల్లో పీవీటీజీ తెగకు చెందిన గిరిజనుల నివాస గ్రామాలకు సరైన రహదారి సౌకర్యం లేకపోవడంతో వైద్యం, విద్య, రవాణాకు ఆటంకాలు ఏర్పడుతున్నాయని, దీనికి సంబంధించి జిల్లా కలెక్టర్ విజయకృష్ణన్‌కు, డీఈవో అప్పారావు నాయుడికి, పీవోకి ఫిర్యాదు చేశామన్నారు. దీంతో జిల్లా కలెక్టర్ విజయకృష్ణన్, డీఈవో అప్పారావునాయుడు ఫిబ్రవరిలో ఆయా గ్రామాలు సందర్శించి సమస్యలు తెలుసుకున్నారని, ఆశా వర్కర్‌ని, అంగన్‌వాడీ కేంద్రం ఏర్పాటు చేస్తామని, అలాగే రోడ్డు సమస్య తీరుస్తామని హామీ ఇచ్చి వెళ్లారని తెలిపారు. అయితే సమస్యలు మాత్రం పరిష్కారం కాకపోవడం బాధాకరమన్నారు. పాడేరు పీవో ఈ గ్రామాలు ఎందుకు సందర్శించడం లేదో అర్థం కావడం లేదని విమర్శించారు, ఇప్పటికైనా ఈ గ్రామాల రవాణా సదుపాయాలు మెరుగుపరిచి, గుర్తించిన సమస్యలు వెంటనే పరిష్కరించాలని డిమాండు చేశారు.

- ప్రభుత్వ ప్రోత్సాహం కరువు
- కొబ్బరి పీచుతో పలు ఉత్పత్తుల తయారీ
- విశాఖ నుంచి చైనాకు ఎగుమతి
- వందలాది మందికి ఉపాధి
- జిల్లాలో 34 పీచు పరిశ్రమలు, 20 వేల ఎకరాల్లో కొబ్బరి సాగు
- విద్యుత్ సబ్సిడీ విడుదల చేయాలని కొబ్బరి పీచు యాజమాన్యాలు వినతి

కష్టాల్లో పీచు పరిశ్రమ

కొబ్బరి పీచు పరిశ్రమలు నష్టాల బాట పడుతున్నాయి. ప్రభుత్వం నుంచి వచ్చే విద్యుత్ సబ్సిడీతో పాటు ఇతర ప్రోత్సాహకాలు కరువయ్యాయి. కొబ్బరి పీచుతో తయారు చేసే ఉత్పత్తులు అనకాపల్లి జిల్లా నుంచి చైనాకు ఎగుమతి అవుతున్నాయి. విదేశాల్లో కొబ్బరి పీచు ఉత్పత్తులకు గిరాకీ ఉన్నా స్థానికంగా పరిశ్రమలకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నుంచి తగిన ప్రోత్సాహకాలు లేక యాజమాన్యాలు నష్టాలు చవి చూస్తున్నారు.



పరిశ్రమలో కొబ్బరి పీచు నిల్వలు

సాక్షి, అనకాపల్లి :

కొబ్బరి సాగు చేసే రైతు వృథాగా పడవేసే కొబ్బరి డొక్కులను పీచు పరిశ్రమలు కొనుగోలు చేసి వివిధ పీచు ఉత్పత్తులు తయారు చేస్తున్నాయి. అయితే విదేశాల నుంచి తగిన గిరాకీ ఉన్నా..సరిపడా పీచు ఉత్పత్తులను ఎగుమతి చేయలేని పరిస్థితి నెలకొంది. జిల్లాలో ఉన్న కొబ్బరి పీచు పరిశ్రమల యాజమాన్యం ప్రభుత్వం వచ్చే సబ్సిడీని, ప్రోత్సాహకాలను త్వరితగతిన అందించాలని కోరుతున్నారు. కొబ్బరి పీచుతో సోఫాసెట్లు, కార్పెట్లు, పరుపులు, తాళ్లు తయారు చేస్తారు. ఇలాంటి కొబ్బరి పీచు పరిశ్రమలు అనకాపల్లి జిల్లాలో యలమంచిలి, ఎస్.రాయవరం, రాంబిల్లి మండలాల్లో ఎక్కువగా ఉన్నాయి. వీటి ద్వారా రైతులకు అదనపు ఆదాయం..స్థానిక మహిళలకు ఉపాధి కూడా కలుగుతుంది. పీచుకు డిమాండ్ ఉంది..రైతు నుంచి ముడి సరుకు సమృద్ధిగా ఉంది. కానీ పీచు తయారీకి ఖర్చు ఎక్కువవుతోంది. ప్రభుత్వాలు విద్యుత్ సబ్సిడీ కల్పించి పరిశ్రమలను ఆదుకోవాలని యాజమానులు కోరుతున్నారు.

చైనాకు ఎగుమతి..

అనకాపల్లి జిల్లా నుంచి చైనా దేశంతో పాటు చెన్నై, గుజరాత్, కోల్‌కత్తా లాంటి రాష్ట్రాలకు ఎగుమతి చేస్తారు. అనకాపల్లి జిల్లా నుంచి కొనుగోలు చేసి చెన్నై, విశాఖలో చైనాకు సంబంధించి ఏజెంట్ల ద్వారా పోర్టు నుంచి ఎగుమతి అవుతుంది. కొబ్బరి పీచుతో కృత్రిమ బొమ్మలు, ప్లేవుడ్, పరుపులు కూడా తయారు చేస్తారు.

15 వేల ఎకరాల్లో కొబ్బరి సాగు..

అనకాపల్లి జిల్లాలో 15 వేల ఎకరాల్లో కొబ్బరి సాగు జరుగుతోంది. ఇక్కడ కొబ్బరి పీచు పరిశ్రమల ద్వారా నెలకు 10 టన్నుల పీచు, తాళ్లు ఉత్పత్తి చేస్తూ పరోక్షంగా 3 వేల మంది వరకు ఉపాధి పొందుతున్నారు. పీచు పరిశ్రమలకు అవసరమైన కొబ్బరి డొప్పలను ట్రాక్టర్ లోడు రూ.4వేల నుంచి, రూ.5 వేల వరకు, లారీలోడు రూ.7వేల నుంచి రూ.8 వేల వరకు చెల్లించి కొనుగోలు చేస్తారు. పీచు తయారీకి కిలోకు రూ.8 వరకు ఖర్చవుతుంది. మిగిలిన పొట్టును ఇటుకల బట్టీలకు విక్రయిస్తుంటారు. పరిశ్రమ వద్దకు తెచ్చిన డొక్కను పీచుగా మార్చడానికి కనీసం నెల రోజుల వ్యవధి పడుతుంది. ఇటీవల స్థానికంగా కూడా వీటి వినియోగం పెరగడంతో 30 శాతం ఉత్పత్తులను ఇక్కడే ఉపయోగిస్తున్నారు. ప్రస్తుతం కొబ్బరి దిగుబడులు తగ్గడంతో కిలో ధర రూ.8 మాత్రమే ఉందని రైతులు పేర్కొంటున్నారు. విదేశీ మారక ద్రవ్యాన్ని ఆదాయంగా అందిస్తున్న కొబ్బరి పీచు తయారీని ప్రభుత్వం ప్రోత్సహించాల్సి ఉంది.

కొబ్బరి పీచును నిల్వ చేసుకునేందుకు గోదాముల ఏర్పాటుకు ప్రభుత్వం ఆర్థిక సహకారం అందించాలని, రాయితీలు ఇవ్వాలని పరిశ్రమల యాజమాన్యాలు విజ్ఞప్తి చేస్తున్నారు.

జిల్లా వ్యాప్తంగా 34 పరిశ్రమలు
ప్రధానంగా ఎస్.రాయవరం, రాంబిల్లి, అచ్యుతాపురం, యలమంచిలిలో పరిశ్రమలున్నాయి
ఏడాదికి 6 టన్నుల పీచు తయారీ
కొబ్బరి తాళ్లు, నార, మ్యాట్‌లుగా తయారీ
సుమారుగా 3000 మంది ఉపాధి
12 వేల ఎకరాలకు పైగా కొబ్బరి తోటల సాగు

ఒక్కో కొబ్బరి కాయ నుంచి 80 గ్రాముల పీచు..

జిల్లాలో చిన్నాపెద్ద కలిపి 34 కొబ్బరి పీచు పరిశ్రమలు ఉండగా.. సగటున 350 గ్రాముల బరువు ఉన్న ఎండు కొబ్బరి కాయ నుంచి 80 గ్రాములు పీచు వస్తే.. కొబ్బరి పొట్టు 160 గ్రాముల వరకు వస్తోంది. ఏడాదికి 6వేల టన్నుల పొట్టు ఉత్పత్తి అవుతోందని అంచనా. అధిక ఈసీ ఉన్న కొబ్బరి పొట్టును నేరుగా వినియోగిస్తే మొక్కలు దెబ్బతింటాయి. దీంతో వివిధ పద్ధతులలో ఈసీ శాతం తగ్గించి కంపోస్టుగాను, బ్రిక్స్ రూపంలో తయారు చేసి ఎగుమతి చేస్తున్నారు. ఈసీ ఎక్కువగా ఉన్న పొట్టును ఇటుక బట్టీలకు టన్ను రూ.2,500 చొప్పున విక్రయిస్తుండగా తక్కువ ఈసీ ఉన్న పొట్టును టన్ను రూ.5 వేలకు విక్రయిస్తున్నారు. కొబ్బరి పొట్టు నాణ్యమైన సేంద్రియ ఎరువుగా తయారైతే, దాని ధర పొట్టు రూపంలో టన్ను రూ.14 వేల నుంచి రూ.20 వేల వరకు ధర ఉంది.

రాయితీ కల్పించాలి..



కొబ్బరి పీచు పరిశ్రమలు పరిస్థితి బాలేదు. అప్పుల ఊబిలో కూరుపోయాం. వ్యవసాయ రంగానికి అనుబంధంగా ఉన్న కొబ్బరి పీచు పరిశ్రమలకు విద్యుత్ రాయితీ కల్పించాలి. జిల్లాలో మరిన్ని కొబ్బరి పీచు తయారీ పరిశ్రమలు ఏర్పాటుకు ప్రభుత్వం చొరవ తీసుకోవాలి. స్థానిక మహిళలకు ఉపాధి కలుగుతోంది.

– కోలా జగదీష్, యాజమాని, కొరుప్రోలు గ్రామం

క్లుప్తంగా

2 టన్నుల పీడీఎస్ బియ్యం పట్టివేత



వాహనంతో పాటు పట్టుకున్న పీడీఎస్ బియ్యం

కె.కోటపాడు : మండలంలో గుల్లేపల్లి కూడలి వద్ద శనివారం రాత్రి వాహనంలో అక్రమ రవాణా చేస్తున్న పీడీఎస్ బియ్యాన్ని కె.కోటపాడు పోలీసులు పట్టుకున్నారు. వాహనంలో తరలిస్తున్న 2 టన్నుల బియ్యం స్వాధీనం చేసుకుని, డ్రైవర్ బూర నాగేశ్వరరావును అదుపులోకి తీసుకున్నామని ఎస్ఐ ధనుంజయ్ తెలిపారు. బియ్యంతో పాటు వాహనాన్ని సీజ్ చేసి, డ్రైవర్‌పై కేసు నమోదు చేశామని తెలిపారు.

'కుబేర' పైరసీ ప్రదర్శనపై ఫిర్యాదు



విచారణ చేపడుతున్న పోలీసులు

తగరపువలస: తాళ్లవలస తిరుమల విద్యాసంస్థల యాజమాన్యం చిట్టివలస క్యాంపస్ విద్యార్థుల కోసం ఆదివారం సాయంత్రం 'కుబేర'సినిమాను ప్రదర్శించింది. ప్రస్తుతం ఈ చిత్రం తగరపువలసలోని తాతా థియేటర్‌లో ప్రదర్శించబడుతోంది. ఓటీటీలోకి ఇంకా విడుదల కాని ఈ సినిమాను క్యాంపస్ బయట, రోడ్డుపైనే రెండు స్క్రీన్లను ఏర్పాటు చేసి ప్రదర్శించడాన్ని థియేటర్ యాజమాని పరిమి గోపి తీవ్రంగా అభ్యంతరం వ్యక్తం చేశారు. తిరుమల యాజమాన్యం పైరసీకి పాల్పడిందని ఆరోపిస్తూ.. తమ సిబ్బందిని పంపి సినిమా ప్రదర్శనను నిలిపివేయించారు. అనంతరం ఆయన పోలీసులకు ఫిర్యాదు చేయగా.. వారు వెంటనే ఘటనా స్థలానికి చేరుకున్నారు. అక్కడ ఏర్పాటు చేసిన రెండు ప్రొజెక్టర్లు, రెండు స్క్రీన్లు, అలాగే పెన్‌డ్రైవ్‌లను స్వాధీనం చేసుకున్నారు.

పోస్టల్ ఉద్యోగుల క్రికెట్ మ్యాచ్



పోస్టల్ శాఖ ఉద్యోగులు డైట్ కళాశాలలో క్రికెట్ ఆడుతున్న దృశ్యం

అనకాపల్లి : క్రీడల ద్వారా ఆరోగ్యంగా జీవించవచ్చని డైట్ కళాశాల చైర్మన్ దాడి రత్నాకర్ అన్నారు. స్థానిక జాతీయ రహదారి డైట్ కళాశాలలో పోస్టల్ శాఖ ఉద్యోగుల ఒక రోజు క్రికెట్ మ్యాచ్‌ను ఆదివారం ఆయన ప్రారంభించి మాట్లాడారు. తపాల శాఖ ఉద్యోగులు ప్రతి ఏడాది క్రికెట్ మ్యాచ్‌లు ఆడడం ఎంతో ఆనందంగా ఉందన్నారు. విశాఖ, విజయనగరం, శ్రీకాకుళం జిల్లాల్లో విధులు నిర్వహిస్తున్న పోస్టల్ ఉద్యోగులు మానసిక ప్రశాంతతకు క్రికెట్ ఆడడం ఎంతో ఆనందాన్ని కలిగించిందని ఆయన పేర్కొన్నారు. తపాలశాఖ యూనియన్ రీజియన్ అధ్యక్షుడు వై.బి.పలాసరావు మాట్లాడుతూ క్రీడల వలన మానసిక ప్రశాంతత కలుగుతుందన్నారు. సుమారుగా 100 మంది క్రీడాకారుల పాల్గొడం అభినందనీయమని ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో తపాలశాఖ ఉద్యోగులు తదితరులు పాల్గొన్నారు.

ఉపాధి @ ఐటీఐ



ఉపాధి శిక్షణకు ఎంపికైన విద్యార్థులతో అధ్యాపక బృందం (ఫైల్)



విద్యార్థులకు శిక్షణ ఇస్తున్న అధ్యాపకుడు

- పారిశ్రామిక వృత్తి విద్య శిక్షణతో మెండుగా ఉపాధి అవకాశాలు
- ఐటీఐల్లో చురుగ్గా ప్రవేశాలు
- పలు ట్రేడుల్లో అభ్యర్థుల చేరిక
- అందుబాటులో మిగులు సీట్లు



ప్రయోగ తరగతులను పరిశీలిస్తున్న అధ్యాపకులు

సంప్రదించాల్సిన ఐటీఐలు	పాత ఐటీఐ, కంచరపాలెం న్యూ ఐటీఐ, గాజువాక ఐటీఐ, నరవ బాలికల ఐటీ, కంచరపాలెం ఇండస్ట్రియల్ ఏరియా
ఏడాది కోర్సులు	7
రెండేళ్ల కోర్సులు	15
ప్రభుత్వ ఐటీఐల్లో సీట్లు	1,648
ప్రైవేట్ ఐటీఐల్లో సీట్లు	1,638
మొత్తం 35 ఐటీఐల్లో సీట్లు	3,286
వైబ్‌సైట్	iti.ap.gov.in

కంచరపాలెం: ప్రభుత్వ పారిశ్రామిక శిక్షణ సంస్థ(ఐటీఐ)ల్లో శిక్షణ పొందుతున్న విద్యార్థులకు ఉపాధి అవకాశాలు మెండుగా లభిస్తున్నాయి. పదో తరగతి పూర్తి చేసిన విద్యార్థులకు త్వరగా ఉపాధి పొందే కోర్సుల్లో ఐటీఐ ఒకటి. వీరికి వృత్తి పరమైన ప్రాధాన్యం అధికంగా ఉంటుంది. ప్రధానంగా జిల్లా విద్యార్థులు ఇంటర్మీడియట్, పాలిటెక్నిక్‌తోపాటు ఐటీఐ చదివేందుకు అధిక ప్రాధాన్యమిస్తారు. వివిధ ట్రేడుల్లో ఐటీఐ కోర్సులు విజయవంతంగా పూర్తి చేసిన విద్యార్థులు అప్రంటీస్ తర్వాత 18 ఏళ్ల నిండాక పరిశ్రమలు, ప్రభుత్వరంగ సంస్థల్లో ఉద్యోగ అవకాశాలు పొందవచ్చు. డాక్‌యార్డ్, ఆర్టీసీ, షిప్‌యార్డ్, రైల్వే, విద్యుత్, రక్షణ శాఖ వంటి వాటిల్లో సైతం ఉద్యోగాలకు ప్రయత్నించవచ్చు. చదువులో ఒత్తిడి ఉండదు. ఆయా పరిశ్రమలు, సంస్థల్లో ఉద్యోగాలు పొందాలంటే విద్యార్థులకు సాంకేతిక రంగంపై స్కిల్స్ తప్పనిసరిగా ఉండాలి. నైపుణ్యం ఉన్న వారికి తప్పకుండా ఉపాధి లభిస్తుంది. మరోవైపు స్కిల్ హబ్‌లు ఏర్పాటు చేసి విద్యార్థులకు నైపుణ్య అంశాలపై శిక్షణ ఇస్తున్నారు. ఉద్యోగం, ఉపాధితో పాటు స్వయం ఉపాధికి సైతం ఈ కోర్సులు ఎంతగానో దోహదపడతాయి.

22 ట్రేడ్‌ల్లో శిక్షణ

విశాఖ జిల్లా పరిధిలో నాలుగు ప్రభుత్వ, 31 ప్రైవేట్ ఐటీఐల్లో 3,286 సీట్లు ఉన్నాయి. ఏడాది, రెండేళ్ల వ్యవధి ఉన్న 22 ట్రేడ్ కోర్సులు నిర్వహిస్తున్నారు. కొన్ని ట్రేడ్‌ల్లో 8వ తరగతి విద్యార్హతతో శిక్షణ ఇస్తున్నారు. అభ్యర్థుల సంఖ్యకు తగ్గట్టుగా ప్రభుత్వ ఐటీఐల్లోని పలు ట్రేడ్‌ల్లో సీట్ల సంఖ్య పెరిగితే అధికంగా ఉద్యోగాలు వచ్చే అవకాశాలు మెండుగా ఉంటాయని పలువురు సూచిస్తున్నారు.

ఏడాది కోర్సులు

ప్లంబర్, కంప్యూటర్ ఆపరేటర్ అండ్ ప్రోగ్రామింగ్ అసిస్టెంట్(కోపా), కార్పెంటర్, మెకానికల్ డీజిల్, పీపీవో, స్టెనోగ్రఫీ, వెల్డర్.

రెండేళ్ల కోర్సులు

ఏవో కెమికల్, డీఎం సివిల్, డీఎం మెకానికల్, ఫిట్టర్, ఇన్‌స్టుమెంటేషన్ మెకానికల్, మెకనిస్ట్, ఐసీ అండ్ టీఎస్ఎం, టర్నర్, ఆర్ అండ్ ఏసీ మెకానిక్, ఎంఎంటీఎం, పెయింటర్(జి), ఎలక్ట్రీషియన్, ఎలక్ట్రానిక్ మెకానికల్, ఐఎం కెమికల్, మెషినిస్ట్ మెకానిక్(ఎంఎం).

15 నుంచి రెండో విడత కౌన్సెలింగ్

ప్రభుత్వ, ప్రైవేట్ పారిశ్రామిక శిక్షణ సంస్థల్లో మొదటి విడత కౌన్సెలింగ్ పూర్తయింది. మిగులు సీట్ల కోసం ఈ నెల 15 నుంచి ప్రభుత్వ ఐటీఐల్లో రెండో విడత కౌన్సెలింగ్ జరగనుంది. ఆసక్తి గల విద్యార్థులు ముందుగా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకుని సమీపంలోని ఐటీఐకు వెళ్లి పలు ట్రేడ్‌ల్లో చేరవచ్చు. జూలై నెలాఖరు తేదీ లోపు ప్రవేశాల ప్రక్రియ పూర్తి చేస్తారు. ఆగస్టు మొదటి వారం నుంచి శిక్షణ తరగతులు ప్రారంభమవుతాయి.

ఉత్తమ శిక్షణ ఇస్తున్నారు



పారిశ్రామిక శిక్షణ కేంద్రంలో పలు ట్రేడ్‌ల్లో శిక్షణ పొందిన అభ్యర్థులు అప్రెంటిస్‌కు ఎంపిక అవుతున్నాం. విద్యార్థుల ఉద్యోగావకాశాలకు ఉత్తమ శిక్షణ అందించడంలో అధ్యాపకులందరూ మంచి తర్ఫీదు ఇస్తున్నారు. శిక్షణ పూర్తయిన వెంటనే ప్లేస్‌మెంట్(ఉపాధి) దొరికేందుకు అధ్యాపకులు కృషి చేస్తున్నారు.

– కె.కమల్, విద్యార్థి, కంచరపాలెం ఐటీఐ

మంచి నైపుణ్యాలతో ఉపాధి



ఐటీఐ విద్యార్థులకు అప్రెంటిస్, స్కిల్ డెవలప్‌మెంట్‌లో శిక్షణ ఇచ్చి ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పిస్తున్నాం. ఏడాది కోర్సుల్లో కొత్తగా రెండు ట్రేడ్లు చేర్చాం. విద్యార్థులు ఏడాది, రెండేళ్ల కోర్సుల్లో చేరవచ్చు. షెడ్యూల్ మేరకు కౌన్సెలింగ్ నిర్వహిస్తున్నాం. పారిశ్రామిక శిక్షణతో టెక్నికల్ విద్యకు అధికంగా ప్రాధాన్యం పెరుగుతుంది.

– జి.శ్రీకాంత్ ప్రిన్సిపాల్, కన్వీనర్, ప్రభుత్వ ఐటీఐ (ఓల్డ్)

'యాత కులస్తులను అవమానిస్తున్న కూటమి ప్రభుత్వం'



యాత కులస్తులకు రాజకీయంగా రిజర్వేషన్లు కల్పించాలని సంఘీభావం తెలుపుతున్న సంఘ అధ్యక్షుడు పెంకే మారేష్

అనకాపల్లి: ఉత్తరాంధ్రలో ఉన్న యాత కులస్తులకు కీలక రాజకీయ పదవులు ఇవ్వకుండా కూటమి ప్రభుత్వం అవమానిస్తుందని జిల్లా యాత సంక్షేమ సంఘం అధ్యక్షుడు పెంకే మారేష్ విమర్శించారు. స్థానిక నాయుళ్లవీధి సంఘం కార్యాలయంలో ఆదివారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. తరతరాలుగా యాత కులస్తులను అన్ని రాజకీయ పార్టీలు ఓటు బ్యాంకు రాజకీయాల వరకే వాడుకుంటున్నారని, యాత కులస్తులను రాజకీయంగా, సామాజికంగా అభివృద్ధి పరిచే ఏ చర్యలు తీసుకోవడం లేదన్నారు. ఉత్తరాంధ్రలోని యాత కులస్తుల్లో అక్షరాస్యత శాతం చాలా తక్కువన్నారు. పేదరికం, నిరుద్యోగం వారిని పట్టి పీడిస్తున్నాయన్నారు. జిల్లా ప్రధాన కార్యదర్శి గుత్తుర్తి అప్పారావు మాట్లాడుతూ బీసీఏలో 54 కులాల నుంచి 32 కులాలను అత్యంత వెనకబడిన కులాలుగా గుర్తించి వారి జీవన విధానాన్ని మెరుగుపరుస్తామని జారీ చేసిన జీవో నంబర్ 17ను తక్షణమే అమలు చేయాలని కోరారు. వచ్చే స్థానిక సంస్థల ఎన్నికల్లో తెలంగాణ రాష్ట్రం మాదిరిగా ఏపీలో 42 శాతం బీసీ రిజర్వేషన్లను అమలు చేయాలన్నారు. పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు పిల్లి శ్రీనివాసరావు మాట్లాడుతూ ఎంబీసీలకు 15 శాతం రిజర్వేషన్ కేటాయించాలన్నారు. ఈ కార్యక్రమంలో సంఘం సభ్యులు కర్రి వెంకటరమణ, బత్తిని సత్యనారాయణ, ఒడిసెల సూరిబాబు, కట్ట అప్పారావు, రాముడు రమేష్, గేడి సంతోష్, తదితరులు పాల్గొన్నారు.

చెస్ పోటీల విజేతలు భవన్, శ్రావ్యశ్రీ



శివసాయి దివ్యతో తలపడుతున్న శ్రావ్యశ్రీ

విశాఖ స్పోర్ట్స్: రాష్ట్ర స్థాయి అండర్–15 చదరంగం చాంపియన్‌షిప్‌ను కె.భవన్ (ఓపెన్ విభాగం), శ్రావ్యశ్రీ (బాలికల విభాగం) కై వసం చేసుకున్నారు. ఆల్ విశాఖ చెస్ సంఘం ఆధ్వర్యంలో బీవీకే కళాశాలలో ఈ పోటీలు జరిగాయి. ఓపెన్ విభాగంలో 200 మంది బాలురు, బాలికల విభాగంలో 99 మంది ఏడేసి రౌండ్ల పాటు జరిగిన ఈ పోటీల్లో తలపడ్డారు. ఓపెన్ విభాగంలో ఎన్టీఆర్ జిల్లాకు చెందిన భవన్ ఆరున్నర పాయింట్లతో విజేతగా నిలిచాడు. హర్ష కీర్తన, వినీల్ కార్తీక్, టి.నిశ్చల్ ఆరేసి పాయింట్లతో పోటీ ముగించారు. బాలికల విభాగంలో అనకాపల్లి జిల్లాకు చెందిన శ్రావ్యశ్రీ ఆరున్నర పాయింట్లతో విజేతగా నిలిచింది. శివసాయి దివ్య, ఆష్నీన్, గురువర్షిణి ఆరేసి పాయింట్లతో తర్వాతి స్థానాల్లో నిలిచారు. ఆయా కేటగిరీల్లో తొలి నాలుగు స్థానాల్లో నిలిచిన క్రీడాకారులను రాష్ట్ర జట్టుకు ఎంపిక చేశారు. వీరంతా నవంబర్ 2వ తేదీ నుంచి ఉత్తరప్రదేశ్‌లో జరిగే జాతీయ అండర్–15 చదరంగం చాంపియన్‌షిప్‌లో పాల్గొంటారని నిర్వాహకులు తెలిపారు.

స్మార్ట్ మీటర్లు తొలగించకుంటే భారీ ఆందోళన



వెంకటాపురంలో వ్యవసాయ స్మార్ట్ మీటర్లను పరిశీలిస్తున్న సీపీఎం జిల్లా కార్యదర్శి కోటేశ్వరరావు, ఉపాధ్యక్షుడు సత్యనారాయణ

మునగపాక: రాష్ట్ర ప్రభుత్వం స్మార్ట్ మీటర్లను తొలగించకుంటే రైతులతో కలిసి భారీ ఆందోళన చేపడతామని సీపీఎం జిల్లా కార్యదర్శి జి.కోటేశ్వరరావు హెచ్చరించారు. మండలంలోని వెంకటాపురంలో వ్యవసాయ క్షేత్రాల్లో ఏర్పాటు చేసిన స్మార్ట్‌మీటర్లను ఆదివారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వ్యవసాయ మోటార్లకు స్మార్ట్ మీటర్లు బిగించడంతో రైతులకు రూ.20 వేల నుంచి రూ.22 వేల వరకు విద్యుత్ బిల్లులు వస్తాయన్నారు. రైతులు గగ్గోలు పెడుతున్నా అధికారులు పట్టించుకోక పోవడం దారుణమన్నారు. కేంద్ర ప్రభుత్వం ప్రైవేటీకరణలో భాగంగా రాష్ట్ర ప్రభుత్వం స్మార్ట్‌మీటర్లను ఏర్పాటు చేస్తుందన్నారు. ఒక్కో మీటరుకు రూ.13వేలు చొప్పున రైతుల నుంచి వసూలు చేసేందుకు ప్రభుత్వం రంగం సిద్ధం చేసిందన్నారు. ఎన్నికల ముందు ప్రతిపక్షంలో ఉన్న టీడీపీ.. స్మార్ట్‌మీటర్లను వ్యతిరేకించిన విషయాన్ని ఆయన గుర్తు చేశారు. ఇప్పటికైనా ప్రభుత్వం పునరాలోచన చేసి స్మార్ట్ మీటర్ల తొలగింపు చేపట్టాలని, లేకుంటే రైతులతో కలిసి పోరాటం చేసేందుకు సిద్ధంగా ఉన్నామన్నారు. సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు గనిశెట్టి సత్యనారాయణ, రైతులు కడియం కృష్ణ, గోవిందరావు, సుందరపు అప్పలరాజు, నీలకంఠరావు, చిన్ని అప్పారావు, మహాలక్ష్మీరావు, తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి అండర్-16 ఫుట్‌బాల్ శిక్షణ తరగతులు ప్రారంభం




శిక్షణకు హాజరైన బాలుర జట్టు సభ్యులు

తగరపువలస: చిట్టివలస బంతాట మైదానంలో రాష్ట్రస్థాయి అండర్–16 ఫుట్‌బాల్ బాలుర జట్టుకు ఆదివారం శిక్షణ తరగతులు ప్రారంభమయ్యాయి. రాష్ట్ర ఫుట్‌బాల్ అసోసియేషన్ అధ్యక్షుడు కోటగిరి శ్రీధర్ సూచనల మేరకు, అనంతపురానికి చెందిన దాదా ఖలందర్ జట్టుకు కోచ్‌గా వ్యవహరిస్తున్నారు. అసోసియేషన్ జిల్లా కార్యదర్శి ఆక్కరమాని చినబాబు, ఉపాధ్యక్షుడు రాజారావు, కోల చంద్రశేఖర్ 10 రోజుల పాటు జరిగే శిక్షణ కార్యక్రమాన్ని పర్యవేక్షిస్తున్నారు. శిక్షణ అనంతరం జట్టు ఈ నెల 26న మధ్యప్రదేశ్‌లోని బాలాఘాట్‌లో జరిగే ఆల్ ఇండియా అండర్–16 టోర్నమెంట్‌లో పాల్గొననుంది.

కిడ్నీ అమ్మకానికి వచ్చిన వ్యక్తిని అడ్డుకున్న పోలీసులు

తాటిచెట్లపాలెం : ఆర్థిక సమస్యల కారణంగా కిడ్నీని అమ్ముకోవడానికి ఏలూరు నుంచి నగరానికి వచ్చిన ఒక వ్యక్తి ప్రయత్నాన్ని ఫోర్త్ టౌన్ పోలీసులు అడ్డుకుని, విచారణ జరిపారు. గత నెల 30వ తేదీన అక్కయ్యపాలెం హైవే సమీపంలో ఉన్న ఒక హోటల్‌లో ఇద్దరు వ్యక్తులు కిడ్నీ అమ్మకం గురించి మాట్లాడుకుంటున్నారని హోటల్ సిబ్బంది పోలీసులకు సమాచారం ఇచ్చారు. సమాచారం అందుకున్న పోలీసులు వెంటనే స్పందించి, ఆ ఇద్దరినీ స్టేషన్‌కు తరలించి విచారించారు. విచారణలో వారిద్దరూ ఏలూరుకు చెందిన రంగబాబు, యేసురాజుగా గుర్తించారు. ఆర్థిక ఇబ్బందుల వల్ల కిడ్నీని అమ్ముకోవాలని రంగబాబు తన స్నేహితుడైన యేసురాజుకు చెప్పినట్లు విచారణలో వెల్లడైంది. పోలీసులు మరింత లోతుగా విచారించగా, వీరు కిడ్నీ అమ్మకం కోసం ఎవరినీ సంప్రదించలేదని, దళారులను కలుసుకోలేదని తేలింది. ఈ విషయంలో ఎలాంటి అనుమానాలు లేవని నిర్ధారించుకున్న పోలీసులు వారిని సొంత ఊరికి పంపించారు. ఈ విషయమై విచారణ ఇంకా కొనసాగుతోందని పోలీసులు తెలిపారు.

రైలు ఢీకొని గుర్తుతెలియని వ్యక్తి మృతి



గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం

అనకాపల్లి: అనకాపల్లి-కశింకోట రైల్వే స్టేషన్ల మధ్య గుర్తు తెలియని రైలు ఢీకొని సుమారుగా 45 నుంచి 50 సంవత్సరాలు వయస్సు గల వ్యక్తి మృతిచెందినట్టు దువ్వాడ జీఆర్పీ ఎస్ఐ లక్ష్మి ఆదివారం చెప్పారు. మృతుడి ఎత్తు 5.3 అడుగులు, జుట్టు నలుపు రంగు కలరింగ్, తల నుజ్జునుజ్జు అయ్యి గుర్తు పట్టలేని విధంగా మృతి చెందినట్టు ఎస్ఐ చెప్పారు. మృతుని వద్ద ఎటువంటి ఆధారాలు లభ్యం కాలేని పేర్కొన్నారు. పోస్టుమార్టం నిమిత్తం అనకాపల్లి ఎన్టీఆర్ ఆస్పత్రికి తరలించడం జరిగిందని, మరిన్ని వివరాలకు సెల్ నంబర్ 7382058996ను సంప్రదించాలని కోరారు.

'కోట'మెచ్చిన విశాఖ

- విలన్‌గా ప్రస్థానం ఇక్కడ నుంచే మొదలు
- బీచ్ అంటే చాలా ఇష్టం
- విశాఖ ఉమ్మడి జిల్లాల్లో ఎన్నో చిత్రాల షూటింగ్



కొమ్మాది: తెలుగు సినీ పరిశ్రమలో తనదైన ముద్ర వేసిన మహానటుడు కోట శ్రీనివాసరావు. విలన్‌గా, విలక్షణ నటుడిగా, తండ్రిగా, రాజకీయ నాయకుడిగా, కామెడీ విలన్‌గా యావత్ తెలుగు ప్రజల హృదయాల్లో సుస్థిర స్థానాన్ని సంపాదించుకున్న కోటకు విశాఖతో విడదీయరాని అనుబంధం ఉంది. ప్రతిఘటన సినిమాతో విలన్‌గా తన ప్రస్థానాన్ని ప్రారంభించిన కోట శ్రీనివాసరావు, విశాఖలో చిత్రీకరించిన ఈ సినిమాతోనే విలన్ పాత్రలకు ఒక కొత్త నిర్వచనం ఇచ్చారు. ఆ చిత్రం ఆయనను 'విలన్ అంటే కోట శ్రీనివాసరావు' అనే స్థాయికి తీసుకెళ్లింది. అప్పటి నుంచి అనేక సినిమాలు విశాఖలో చిత్రీకరించారు. విశాఖలో ఆయన నటించిన చిత్రాలలో ప్రతిఘటన, ఆలీ బాబా అరడజను దొంగలు, జంబలకిడిపంబ, ఆ ఒక్కటి అడక్కు, కర్తవ్యం, దొరబాబు, పోలీస్ బ్రదర్స్, లాఠీచార్జ్, రాజధాని, ఛత్రపతి, యోగి, బుజ్జిగాడు, గణేష్ వంటివి ఎన్నో ఉన్నాయి.

విశాఖ అంటే ఎంతో ఇష్టం

నగరానికి వచ్చినప్పుడు ఆయన ఎక్కువగా దసపల్లా, మేఘాలయ హోటళ్లలో బస చేసేవారని ఆయన సన్నిహితులు తెలిపారు. విశాఖ నగరం అంటే ఆయనకు ఎంతో ఇష్టమని, షూటింగ్ విరామ సమయాల్లో బీచ్‌కు వెళ్లి సేదతీరేవారని సినీ మిత్రులు గుర్తు చేసుకున్నారు. విశాఖ, అరకు ప్రాంతాల్లో ఆయన సినిమాలు షూటింగ్ జరిగాయి.

వైజాగ్ ఫిల్మ్ సొసైటీ సంతాపం

తాటిచెట్లపాలెం: విలక్షణ నటుడు, సుదీర్ఘకాలం తెలుగు సినీ పరిశ్రమకు సేవలందించి, ప్రజల హృదయాల్లో సుస్థిర స్థానం సంపాదించుకున్న కోట శ్రీనివాసరావు మృతి పట్ల వైజాగ్ ఫిలిం సొసైటీ సంతాపం వ్యక్తం చేసింది. ఆయన మరణం సినీ పరిశ్రమకు తీరని లోటని సొసైటీ సెక్రటరీ నరవ ప్రకాశరావు, అధ్యక్షుడు కాశీ విశ్వేశ్వరరావు, కార్యనిర్వాహక కార్యదర్శి బి.చిన్నారావు అన్నారు.

తెలుగు సినీ పరిశ్రమకు తీరని లోటు

తెలుగు సినీ పరిశ్రమ ఓ మహానటుడిని కోల్పోయింది. ఏ పాత్ర వేసినా ఆ పాత్రకు న్యాయం చేసే ఏకైక నటుడు కోట శ్రీనివాసరావు. ఎస్.వీ రంగారావు, కైకాల సత్యనారాయణ, రావు గోపాలరావు వంటి దిగ్గజాల తర్వాత సినీ పరిశ్రమలో అంతటి లోటును తీర్చింది కోట శ్రీనివాసరావే. విశాఖలో సినిమా చిత్రీకరణ అంటే కోట ఎంతో ఉత్సాహంగా వచ్చేవారు. ఆయనతో పలు సినిమాల్లో నటించా. ఆయన మరణం తీవ్ర దిగ్భ్రాంతికి గురి చేసింది. ఆయన మరణం తెలుగు సినీ పరిశ్రమకు తీరని లోటు.

– ప్రసన్న కుమార్, సినీ నటుడు, వైజాగ్

కృష్ణా జెడ్పీ చైర్‌పర్సన్ హారికపై పచ్చమూక దాడులు దుర్మార్గం

- జిల్లా ప్రథమ పౌరురాలికి రక్షణ కల్పించలేకపోవడం దారుణం
- దాడులకు తెగబడిన వారిని కఠినంగా శిక్షించాలి
- వైఎస్సార్‌సీపీ మహిళా విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఈర్లె అనురాధ ధ్వజం



దేవరాపల్లి : కృష్ణా జిల్లా జిల్లా పరిషత్ చైర్ పర్సన్ ఉప్పాల హారికపై టీడీపీ, జనసేన గూండాలు పోలీసుల సమక్షంలోనే దాడికి తెగబడడం అత్యంత దుర్మార్గమని వైఎస్సార్‌సీపీ రాష్ట్ర మహిళా విభాగం ప్రధాన కార్యదర్శి ఈర్లె అనురాధ తీవ్రంగా మండిపడ్డారు. ఈ మేరకు దేవరాపల్లి మండలం తారువలో ఆదివారం ఆమె స్థానిక విలేకర్లతో మాట్లాడారు. బీసీ సామాజిక వర్గానికి చెందిన మహిళా ప్రజాప్రతినిధిపై టీడీపీ, జనసేన గూండాలు ముకుమ్మడిగా దాడి చేయడాన్ని ఆమె తీవ్రంగా ఖండించారు. కూటమి కార్యకర్తలు ఉన్మాదంతో దాడులు చేస్తున్నా పోలీసులు ప్రేక్షక పాత్ర వహించడం ఆందోళన కలిగిస్తుందన్నారు. జిల్లా ప్రథమ పౌరురాలికే రక్షణ కల్పించలేని ఈ ప్రభుత్వం, ఇక సామాన్య మహిళలకు ఏ విధంగా రక్షణ కల్పిస్తుందన్నారు. సోషల్ మీడియాలో పోస్టులు పెట్టారనే నెపంతో ఆగమేఘాలపై ఒక మహిళను జైల్లో పెట్టిన పోలీసులు, జెడ్పీ చైర్ పర్సన్, జిల్లా ప్రథమ పౌరురాలిపై దాడులు చేస్తే అదే మాదిరిగా ఎందుకు స్పందించలేదని ప్రశ్నించారు. రాష్ట్రంలో మహిళలకు రక్షణ కల్పించడంలో కూటమి ప్రభుత్వం ఘోరంగా విఫలమయ్యిందన్నారు. కారులో వెళ్తున్న మహిళా ప్రజాప్రతినిధిని నడిరోడ్డుపై అడ్డగించి దాడికి పాల్పడితే ఇప్పటి వరకు ముఖ్యమంత్రి, డిప్యూటీ సీఎం, హోంమంత్రి ఎందుకు స్పందించలేదని ఆమె ప్రశ్నించారు. మహిళా కమిషన్, డీజీపీ తక్షణమే స్పందించి దాడులకు పాల్పడిన వారిని కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వ విద్యా సంస్థల్లో ఆడపిల్లలకు సైతం రక్షణ కల్పించలేని దౌర్భాగ్య స్థితిలో కూటమి ప్రభుత్వం ఉందని విమర్శించారు. కాకినాడ జిల్లాలోని రంగరాయ వైద్య కళాశాలలో ల్యాబ్ అసిస్టెంట్ విద్యార్థినుల ఫొటోలు తీసి బ్లాక్ మెయిల్ చేయడంపై ఫిర్యాదు చేసినా ఎందుకు చర్యలు తీసుకోలేదని ఆమె ప్రశ్నించారు.

'ఇసుక దందా'పై అధికారుల దాడులు



నదిలోకి వాహనాలు వెళ్లకుండా ట్రెంచ్ కొడుతున్న దృశ్యం

కోటవురట్ల: 'హోం మంత్రి ఇలాకాలో.. ఆగని ఇసుక దందా'శీర్షికన సాక్షిలో ఇటీవల ప్రచురితమైన కథనానికి అధికారులు స్పందించారు. మైనింగ్, రెవెన్యూ, పోలీసు శాఖాధికారులు సంయుక్తంగా శనివారం దాడులు నిర్వహించారు. వరహానదిని పరిశీలించి పలు ప్రాంతాలలో ఇసుక నిల్వలపై దాడులు చేశారు. నదిలోకి వాహనాలు వెళ్లకుండా గాడి కొట్టించారు. తహసీల్దారు తిరుమలబాబు మాట్లాడుతూ సాక్షిలో వెలువడిన కథనంతో పూర్తి స్థాయిలో దాడులు నిర్వహించినట్టు తెలిపారు. ఇందులో గొట్టివాడకు చెందిన సుంకర నూకినాయుడు(బాబ్జీ) అనే వ్యక్తికి చెందిన సర్వే నంబరు 921 జిరాయితీ మెట్టభూమి మామిడి తోటలో రెండు ట్రాక్టర్ల అక్రమ ఇసుక నిల్వ ఉన్నట్టు గుర్తించామన్నారు. ఇసుక నిల్వలకు సంబంధించి ఎటువంటి అనుమతులు లేవని నిర్ధారించామన్నారు. రాత్రి వేళల్లో సమీపంలోని వరాహనదిలో నుంచి అక్రమంగా ఇసుకను తవ్వి ఎడ్ల బళ్ల ద్వారా మామిడి తోటల్లోకి తరలించి అక్కడి నుంచి ట్రాక్టర్ల ద్వారా వేరే ప్రాంతాలకు సరఫరా చేస్తున్నట్టు తమ విచారణలో తేలిందని తెలిపారు. ఇదే సర్వే నంబరు మామిడి తోటలో గతంలో కూడా అనేక సార్లు అక్రమ ఇసుక నిల్వలు గుర్తించి హెచ్చరించామన్నారు. ఈ మేరకు 92/1 సర్వే నంబరు జిరాయితీ మెట్ట భూమి యజమాని సుంకర నూకినాయుడుపై కేసు నమోదు చేసి చర్యలు తీసుకోనున్నట్టు తెలిపారు. విచారణలో గుర్తించిన అంశాలను జిల్లా కలెక్టరుకు నివేదిక సమర్పిస్తున్నట్టు చెప్పారు. గొట్టివాడ పరిధిలో వరాహనదిలోకి వెళ్లకుండా ట్రెంచ్ కొట్టించి రెవెన్యూ అసిస్టెంట్లను కాపలా ఉంచుతామన్నారు. ఈ దాడుల్లో ఎస్ఐ రమేష్, రెవెన్యూ, మైనింగ్ అధికారులు పాల్గొన్నారు.

అక్రమంగా మట్టి తరలింపు

- పొక్లెయిన్, ట్రాక్టర్లు సీజ్





పట్టుబడిన పొక్లెయిన్, ట్రాక్టర్లు

కోటవురట్ల : అక్రమంగా తరలిస్తున్న మట్టి ట్రాక్టర్లను పోలీసులు దాడి చేసి పట్టుకున్నారు. ఎస్ఐ రమేష్ తెలిపిన వివరాలు ఇవి..పాత గొట్టివాడ ప్రాంతం నుంచి మట్టి తరలిపోతోందన్న విశ్వసనీయ సమాచారంతో ఆదివారం ఉదయం పోలీసులు దాడి చేశారు. ఈ దాడిలో ఒక పొక్లయిన్, మూడు ట్రాక్టర్లు పట్టుబడగా వాటిని సీజ్ చేసి పోలీసు స్టేషన్‌కు తరలించారు. మట్టి తరలింపునకు సంబంధించి రెవెన్యూ, మైనింగ్ శాఖాధికారుల నుంచి ఎటువంటి అనుమతి లేనట్టు గుర్తించి తదుపరి చర్యల నిమిత్తం తహసీల్దారుకు సమాచారం ఇచ్చినట్టు ఎస్ఐ తెలిపారు.

ఇసుక ట్రాక్టర్ సీజ్



సీజ్ చేసిన ఇసుక ట్రాక్టర్

మునగపాక : మండల కేంద్రమైన మునగపాకలో ఎటువంటి రికార్డులు లేకుండా ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్‌ను ఆదివారం సీజ్ చేశారు. ఆదివారం మునగపాక మీదుగా ఎటువంటి అనుమతులు లేకుండా ఇసుక లోడుతో వెళుతున్న ట్రాక్టర్‌ను మునగపాక పోలీసులు గుర్తించి వాహనాన్ని స్టేషన్‌కు తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసినట్టు పోలీసులు తెలిపారు.

క్లుప్తంగా

సూర్యనారాయణ స్వామికి ప్రత్యేక పూజలు



అనకాపల్లి: స్థానిక సుంకరమెట్ట జంక్షన్ సత్యనారాయణ, సూర్యనారాయణస్వామి దేవాలయంలో ఆదివారం సూర్యనారాయణ స్వామికి పూలమాలలతో ప్రత్యేకంగా అలంకరించి అర్చకులు వివిధ పూజలు చేశారు. తెల్లవారుజాము నుంచి భక్తులు స్వామివారిని దర్శించుకుని అభిషేకాలు చేశారు. ఆలయ ఈవో మురళీకృష్ణ భక్తులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా ప్రత్యేక చర్యలు చేపట్టారు.

మోదమాంబ ఆలయంలో ప్రత్యేక పూజలు



ఎం.కోడూరు మోదమాంబ ఆలయంలో పూజలు చేస్తున్న భక్తులు

మాడుగుల రూరల్: ఎం.కోడూరు మోదమాంబ అమ్మవారికి ఆదివారం ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. అమ్మవారి ఆలయానికి వచ్చిన భక్తులకు గ్రామానికి చెందిన పడాల కొండలరావు, లక్ష్మీకుమారి దంపతుల ఆర్థిక సహకారంతో ప్రసాద వితరణ చేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ అధ్యక్షుడు, సర్పంచ్ గొల్లవిల్లి సంజీవిరావు, పీఏసీఎస్ మాజీ అధ్యక్షుడు పడాల కొండలరావు, తదితరులు పాల్గొన్నారు.

ట్రిపుల్ ఐటీకి విద్యార్థిని ఎంపిక



బేబీ భవిష్య

కశింకోట: మండలంలోని తాళ్లపాలెంలో గాయత్రి హైస్కూలుకు చెందిన విద్యార్థిని కోన బేబీ భవిష్య శ్రీకాకుళం ట్రిపుల్ ఐటీకి ఎంపికైంది. ఈ ఏడాది పదో తరగతి పబ్లిక్ పరీక్షల్లో 582 మార్కులు సాధించిన మేరకు రెండో విడత జాబితాలో ఎంపికైనట్లు పాఠశాల కమిటీ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపింది. దీంతో ఆమెను పాఠశాల కమిటీతో పాటు ఉపాధ్యాయ సిబ్బంది అభినందనలు తెలిపారు.

గెస్ట్ లెక్చరర్ పోస్టుకు దరఖాస్తులు

సబ్బవరం: స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఒకేషనల్ ఫిజియోథెరపీలో అతిథి అధ్యాపక పోస్టుకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ పెనుమత్స శిరీషరాణి ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. బీపీటీలో 55 శాతం మార్కులు, అనుభవం కలిగిన అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. ఈ నెల 15 మధ్యాహ్నం 3 గంటల్లోపు కళాశాలలో సంప్రదించాల్సిందిగా కోరారు.

అనకాపల్లి సినిమాలు

రాజా	: సూపర్‌మన్
సత్యనారాయణ స్క్రీన్-1	: కన్నప్ప
సత్యనారాయణ స్క్రీన్-2	: 3 డి
పర్తిసాయి	: ఓ భామ అయ్యో రామ
షిర్డీసాయి	: తమ్ముడు
వెంకటేశ్వర	: వర్జిన్ బాయ్స్
శ్రీ సత్య	: ది 100
రామచంద్ర	: 3 బీహెచ్‌కే

రక్త నిల్వలు

అనకాపల్లి: ఎన్టీఆర్ వైద్యాలయ రక్తనిధి కేంద్రంలో 67 యూనిట్ల రక్త నిల్వ ఉంది. ఏ పాజిటివ్-19, బీ పాజిటివ్-10, ఓ పాజిటివ్-35, ఏబీ పాజిటివ్-3 యూనిట్లు చొప్పున శుద్ధి చేసిన రక్త నిల్వ ఉంది. అవసరమైన వారు వైద్యాలయం బ్లడ్‌బ్యాంక్ టెక్నీషియన్ యాలోకేష్(9703613706)ను సంప్రదించవచ్చు.

గ్యాస్ సమాచారం

అనకాపల్లి: ఇండేన్ గ్యాస్ ఏజెన్సీ ద్వారా ఆదివారం 238 మంది గ్యాస్ బుక్ చేసుకున్నారు. గతంలో బుక్ చేసుకున్న వారిలో 201 మందికి సిలిండర్లు సరఫరా చేశారు. వివరాలకు ఇండేన్ గ్యాస్ ఏజెన్సీ ప్రతినిధి 08924-223595 నంబరును సంప్రదించవచ్చు.

వరండాలోనే భోజనం

- భోజన శాల లేక ఇబ్బందులు
- మండలంలోనే అత్యధిక మందికి బోధన
- ఏటా ప్రవేశాలకు డిమాండ్
- కశింకోట జెడ్పీ బాలికోన్నత పాఠశాలపై చిన్నచూపు

కశింకోట:

కాలమేదైనా ఆరు బయట, వరండా, తరగతి గదుల్లోను, స్టేజ్ మీద భోజనాలు చేయాల్సిందే.. మండలంలోనే అత్యధిక మంది బాలికలు చదువుకునే కశింకోట జెడ్పీ బాలికోన్నత పాఠశాలలో దుస్థితి ఇది. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో నాడు- నేడు నిధులతో ఇక్కడ అధునాతన సౌకర్యాలు కల్పించారు. ఇంతలో ఎన్నికలు రావడం కూటమి అధికారంలోకి రావడంతో భోజన శాల నిర్మాణానికి నోచుకోలేదు. దీన్ని నిర్మించాలని కోరుతున్నా ప్రభుత్వం పట్టించుకోవడం లేదు. దీంతో ఆరుబయట భోజనాలు తప్పడం లేదని విద్యార్థినులు వాపోతున్నారు.

కశింకోటలో జిల్లా పరిషత్ బాలికోన్నత పాఠశాల మూడు దశాబ్దాల క్రితం ఏర్పాటు చేశారు. ఇక్కడ 6 నుంచి పది తరగతుల వరకు 580 మంది చదువుతున్నారు. గతంలో 3, 4, 5 తరగతులు ఉన్నప్పుడు 700 మంది వరకు చదివే వారు. స్థానికుల కంటే ఉమ్మడి విశాఖ జిల్లాలోని ఏజెన్సీతో పాటు మైదాన ప్రాంతాల నుంచి కూడా వచ్చి 420 మంది చదువుతున్నారు.

ఎక్కువగా గిరిజన విద్యార్థినులే..

వీరికి స్కూలు పక్కనే సమగ్ర బాలికల వసతి గృహం అందుబాటులో సౌకర్యవంతంగా ఉండటం, తమ ప్రాంతాల నుంచి రవాణా సదుపాయం అనుకూలంగా ఉండటంతోపాటు జిల్లా కేంద్రానికి పక్కనే ఉన్నందున పట్టణ నాగరికత అలవడుతుందని భావించి తల్లిదండ్రులు ఇక్కడ చేర్పించి చదివిస్తున్నారు. దీంతో జిల్లా స్థాయి పాఠశాలగా గుర్తింపు పొందింది. కశింకోట, అనకాపల్లి తదితర మండల గ్రామాల విద్యార్థినులు చదువుతున్నారు.

పూర్తి సౌకర్యాల కల్పనతో భారీగా చేరికలు

మొదటి విడత పీఎంశ్రీలో ఎంపిక చేశారు. దీంతోపాటు నాడు-నేడులో స్కూలును అభివృద్ధి చేశారు. మొదటి విడత నాడు-నేడులో రూ.63 లక్షలతో మౌలిక సదుపాయాలు కల్పించి అందంగా రంగులు వేసి, విద్యుత్ సదుపాయం కల్పించి తీర్చిదిద్దారు. రెండో విడతగా రూ.36 లక్షలు మంజూరు చేశారు. నిధులున్న మేరకు రూ.20 లక్షలతో మూడు తరగతి గదులు నిర్మించారు. పీఎంశ్రీలో రూ.20 లక్షలు వెచ్చించి సైన్స్ ల్యాబ్ భవనం, వాలీబాల్, షటిల్ బ్యాడ్మింటన్ తదితర కోర్టులు నిర్మించి ఆటలు ఆడటానికి సదుపాయం కల్పించారు. దీంతో పాఠశాలలో చేరడానికి విద్యార్థినులు ఆకర్షితులవుతున్నారు. వసతి గృహంలో సీట్లు ఖాళీ లేక పలువురు విద్యార్థినులు వెనుదిరిగారు. లేదంటే మరింత ఎక్కువ మంది పాఠశాలలో చేరేవారు. అయినప్పటికీ ఇంకా ప్రవేశాలు జరుగుతూనే ఉన్నాయి. ఇంతటి ప్రాధాన్యం కలిగిన పాఠశాలలో భోజన శాల లేక తీవ్ర ఇబ్బంది పడుతున్నారు.



స్టేజిపై భోజనం చేస్తున్న బాలికలు



కశింకోటలోని బాలికల హైస్కూలులో వరండాలో భోజనం చేస్తున్న బాలికలు



తరగతి గదిలో భోజనం చేస్తున్న బాలికలు

టెన్త్‌లో ఉత్తమ మార్కులు కూడా సాధిస్తున్నారు. వసతి గృహంలో సీట్లు ఖాళీ లేక కొంతమంది విద్యార్థినులు చేరకుండా వెనుదిరిగారు. లేదంటే మరింతగా సంఖ్య పెరిగి ఉండేది.

దాతల సహకారంతోనైనా నిర్మిస్తే..

ఆరుబయట తరగతి గదుల వరండాల్లోను, తరగతి గదుల్లోను, స్టేజ్‌పైన, ఎక్కడ ఖాళీ ఉంటే అక్కడ భోజనం చేయాల్సిన పరిస్థితిని ఎదుర్కొంటున్నారు. ఇటీవల నిర్వహించిన మెగా పేరెంట్స్ కమిటీ సమావేశంలో సైతం పాఠశాలలో భోజన శాల లేక ఇబ్బంది పడుతున్న విషయాన్ని ప్రస్తావించారు. సత్వరమే భోజనశాల నిర్మించడానికి అధికారులు చర్యలు తీసుకోవాలని, చాలా కాలంగా ఇది లేక ఇక్కట్లు పడుతున్నారని వాపోయారు. దీని నిర్మాణానికి పాఠశాల ప్రాంగణంలో విశాలమైన స్థలం ఉంది. స్థానిక డీపీఎన్ జెడ్పీ హైస్కూలులో దాతల సహకారంతో భోజన శాల నిర్మించారు. ఇక్కడా దాతలు ముందుకు వచ్చి భోజన శాల నిర్మాణం చేపట్టాలని విద్యార్థినులు, వారి తల్లిదండ్రులు కోరుతున్నారు.

తరగతి గదుల్లో భోజనం



పాఠశాలలో భోజన శాల లేక ఇబ్బంది పడుతున్నాం. వరండా, తరగతి గదుల్లో భోజనం చేయాల్సి వస్తోంది. భోజన శాలను నిర్మించడానికి అధికారులు చర్యలు తీసుకోవాలి. – దాడి అగన్య, విద్యార్థిని

అధికారుల దృష్టికి తీసుకెళ్లాం

పాఠశాలలో 580 మంది బాలికలు చదువుతున్నారు. భోజనశాల లేక వీరంతా ఇబ్బంది పడుతున్నారు. దీని నిర్మాణం గురించి అధికారుల దృష్టికి తీసుకెళ్లాం. నిధులు మంజూరై భోజన శాల నిర్మిస్తే బాలికలకు సౌకర్యవంతంగా ఉంటుంది.

–ఎంఎస్ స్వర్ణకుమారి, హెచ్‌ఎం, కశింకోట బాలికల హైస్కూలు

సీజనల్ వ్యాధులపై అప్రమత్తత అవసరం



రోగి వివరాలను తెలుసుకుంటున్న వైద్యుడు సాయి సందీప్

అనకాపల్లి: మారుతున్న కాలానికి అనుగుణంగా ప్రజలు వివిధ రకాల వ్యాధులు బారిన పడకుండా ప్రత్యేక జాగ్రత్తలు తీసుకోవాలని, రహదారులపై తినుబండారాలు తీసుకునే సమయంలో ప్రత్యేక దృష్టి సారించాలని న్యూరో వైద్య నిపుణుడు సాయి సందీప్ తెలిపారు. ప్రజారోగ్య వేదిక ఆధ్వర్యంలో స్థానిక సీఐటీయూ కార్యాలయంలో ఆదివారం ఉచిత మెగా వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రజా ఆరోగ్య వేదిక ఆర్గనైజర్లు మళ్ల చంద్రశేఖర్, కె.శ్రీరామ్మూర్తి మాట్లాడుతూ తొమ్మిది సంవత్సరాలుగా వైద్య శిబిరాన్ని ప్రతి రెండు మాసాలకు నిర్వహిస్తున్నామన్నారు. ఈ శిబిరంలో వైద్య నిపుణులు డి.సాంబమూర్తి, బి.మీనేంద్రకుమార్ వివిధ రకాల వ్యాధులకు పరీక్షలు నిర్వహించారన్నారు. వేదక సభ్యులు డి.రాఘవరావు, జె.రమేష్ బాబు, కె.త్రినాథ్, ఎస్.రాజు, బి.నూకఅప్పారావు పాల్గొన్నారు.

అప్పన్నకు విశేషంగా ఆర్జిత సేవలు



నిత్యకల్యాణంలో కంకణధారణ ఘట్టంలో అర్చకుడు



గరుడసేవ నిర్వహిస్తున్న అర్చకుడు

సింహాచలం: ఏకాదశిని పురస్కరించుకుని శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి ఆదివారం ఆర్జిత సేవలు విశేషంగా జరిగాయి. ఉదయం 7 నుంచి స్వర్ణపుష్పార్చన జరిపారు. ఆలయ కల్యాణమండపంలో వేదికపై స్వామివారి ఉత్సవమూర్తులు గోవిందరాజస్వామి, శ్రీదేవి, భూదేవిలను వేంజేప చేశారు. విష్వక్సేన పూజ, పుణ్యాహవచనం జరిపారు. 108 స్వర్ణ సంపెంగలతో అష్టోత్తర శత నామావళి పూజ నిర్వహించారు. ఉభయదాతలకు స్వామివారి ప్రసాదం, శేషవస్త్రాలను అందించారు.

వైభవంగా నిత్యకల్యాణం

శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి ఆదివారం నిత్యకల్యాణం వైభవంగా జరిగింది. ఆలయ కల్యాణమండపంలో వేదికపై స్వామివారి ఉత్సవమూర్తులు గోవిందరాజస్వామి, శ్రీదేవి, భూదేవిలను కొలువుంచి, ఉదయం 9.30 నుంచి కల్యాణాన్ని శాస్త్రోక్తంగా నిర్వహించారు. విష్వక్సేనపూజ, పుణ్యాహవచనం, కంకణధారణ, యజ్ఞోపవీతం, జీలకర్రబెల్లం, మాంగళ్యధారణ, తలంబ్రాలు తదితర ఘట్టాలతో కల్యాణాన్ని ఘనంగా జరిపారు. ఉభయదాతలకు స్వామివారి అక్షింతలు, ప్రసాదం, శేషవస్త్రాలను అందజేశారు.

ఘనంగా గరుడసేవ

శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి ఆదివారం గరుడసేవ విశేషంగా జరిగింది. ఆలయ కల్యాణమండపంలో స్వామివారి ఉత్సవమూర్తి గోవిందరాజస్వామిని గరుడవాహనంపై వేంజేపచేశారు. అష్టోత్తర శతనామావళి పూజ జరిపారు. భక్తులను గరుడవాహనం చుట్టూ ప్రదక్షిణ చేయించారు. స్వామివారి శేషవస్త్రాలు, ప్రసాదం అందించారు.

గోరింటాకు విశిష్టతపై అవగాహన

పరవాడ: గోరింటాకు పెట్టుకోవడం ద్వారా కొన్ని అనారోగ్య సమస్యలకు దూరంగా ఉండవచ్చని సమరసత సేవా ఫౌండేషన్ మహిళా విభాగం మండల కన్వీనర్ పెదపాటి కృష్ణవేణి తెలిపారు. ఆషాఢ మాసాన్ని పురస్కరించుకుని ఫౌండేషన్ ప్రతినిధులు అచ్యుతాపురం వికలాంగుల ఆశ్రమంలో గోరింటాకు విశిష్టతపై అవగాహన సదస్సును ఆదివారం నిర్వహించారు. పిల్లలకు గోరింటాకు పెట్టడం వలన వైరస్, క్రిమికీటకాలు దరి చేరవన్నారు. కార్యక్రమంలో భాగంగా గోరింటాకు విశిష్టతపై పిల్లలకు అవగాహన కల్పించారు. పిల్లలందరి చేతులకు గోరింటాకు పెట్టి వారితో మాటామంతీ కలిపారు. కార్యక్రమంలో వికలాంగుల పాఠశాల కరస్పాండెంట్ పి.ఎస్.టి.పట్నాయక్, ఇన్‌చార్జి హెచ్‌ఎం పాలిపిల్లి శ్రీను, ఫౌండేషన్ ప్రతినిధులు బొద్దపు నూకరత్నం, పూర్ణ, కింతాడ వరలక్ష్మి పాల్గొన్నారు.



గోరింటాకు పెట్టుకున్న వికలాంగ చిన్నారులతో ఫౌండేషన్ ప్రతినిధులు

బలవంతపు భూసేకరణ నిలిపివేయాలి



ఆర్లిలో కరపత్రాలు పంపిణీ చేస్తున్న సీపీఎం జిల్లా కార్యదర్శి వెంకన్న

కె.కోటపాడు : మండలంలో ఆర్లి, చింతపాలెం, గరుగుబిల్లి ప్రాంతాల్లో వ్యవసాయ భూములను ఎస్‌ఈజెడ్‌ల కోసం రైతుల నుంచి బలవంతంగా తీసుకోవడం తగదని సీపీఎం జిల్లా కార్యదర్శి డి.వెంకన్న అన్నారు. ఎస్‌ఈజెడ్‌లకు భూకేటాయింపుల కోసం రైతుల నుంచి ఎటువంటి అనుమతులు లేకుండా రహస్య సర్వేలను రెవెన్యూ అధికారులు చేస్తూ వారిని ఇబ్బందులు పెట్టే చర్యలు ఎంత మాత్రం సమంజసం కాదని ఆయన అన్నారు. బలవంతపు భూ సేకరణ నిలుపుదల చేయాలని కోరుతూ కె.కోటపాడు మండల తహసీల్దార్‌కు ఈ నెల 16న చెప్పుకుందాం.. కదిలిరండి కార్యక్రమాన్ని నిర్వహించనున్నామని, ఈ మూడు గ్రామాల్లో రైతులను ఆదివారం కలిసి కరపత్రాలను అందించి ప్రచారం చేశారు. ఉదయం 10 గంటలకు మూడు గ్రామాల్లోని రైతులు తహసీల్దార్ కార్యాలయం వద్ద నిర్వహిస్తున్న ధర్నాకు హాజరుకావాలని ఆయన కోరారు. అచ్యుతాపురం ప్రాంతాల్లో ఉన్న కంపెనీల వ్యర్థాలు సముద్రంలో కలుస్తున్నాయని, మరి ఈ ప్రాంతంలో ఏర్పాటు చేస్తున్న కంపెనీల వ్యర్థాలు ఎక్కడకు విడిచిపెడతారని అధికారులను వెంకన్న ప్రశ్నించారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు యర్రా దేముడు, ఈర్లె నాయుడుబాబు, రొంగలి ముత్యాలనాయుడు, తదితరులు పాల్గొన్నారు.



బోసిపోయిన ఎన్టీఆర్ ఆస్పత్రికి వెళ్లే రహదారి

సండే.. మండేన్

- వేసవి కాలాన్ని తలపిస్తున్న ఎండలు
- కొత్త సమస్యలతో బాధపడుతున్న వైనం
- అధిక ఉష్ణోగ్రతలతో వాంతులు, విరేచనాలు
- ప్రత్యామ్నాయాల వైపు ప్రజల పరుగులు



నాలుగు రోడ్ల జంక్షన్‌లో పలచగా జన సంచారం

అనకాపల్లి టౌన్: హమ్మయ్య... ఈ వేసవి గడిచిపోయింది. ఈ ఏడాది అసలు ఎండలే లేవు. భిన్నంగా వర్షాలు కూడా పడ్డాయి. ఇక వానాకాలం వచ్చేసింది.. అని ప్రతి ఒక్కరూ అనుకుంటున్న సయయంలో మూడు రోజుల నుంచి కాస్తున్న ఎండతో ప్రజలు ఉక్కిరిబిక్కిరి అవుతున్నారు. దీంతో ప్రతి ఒక్కరూ ఎండ నుంచి తప్పించుకునేందుకు ప్రత్యామ్నాయ మార్గాలను ఆశ్రయిస్తున్నారు. జ్యూస్ షాపులు, ఏసీ థియేటర్లు, చెట్ల నీడను ఆశ్రయించి సేద తీరుతున్నారు. అత్యవసర పనులు ఉంటే తప్పా రోడ్ల మీదకు రావడం లేదు. దీంతో రోడ్లు నిర్మానుష్యంగా మారుతున్నాయి. ఈ అకాల ఎండలు ప్రజలకు సరికొత్త సమస్యలు తెచ్చిపెడుతున్నాయి. పలు వ్యాధులతో ఇబ్బందులు పడుతున్నారు. ఆస్పత్రులకు క్యూ కడుతున్నారు. మరోవైపు నారుమడులు వేసే రైతులు ఎండలకు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.

జాగ్రత్తలు తప్పనిసరి...

ఎండలోకి వెళ్లేటప్పుడు మగవారు టోపీలు, ఆడవారు చున్నీలు, చీర కొంగులు, గొడుగులు తప్పనిసరిగా ఉపయోగించాలి.

మంచినీరు ఎక్కువగా తీసుకోవాలి. వృద్ధులు అత్యవసరమైతే తప్పా ఇంటి నుంచి బయటకు వెళ్లరాదు.

అనారోగ్య సమస్యలివే...



తీవ్రమైన తలనొప్పి వస్తుంది. తల లోపలి భాగం గిరగిరా తిరుగుతున్నట్లుగా అనిపిస్తుంది. ఆకస్మికంగా వాంతులు, విరోచనాలతో పాటు తీవ్రమైన కడుపునొప్పి వస్తుంటుంది. చలితో కూడిన జ్వరం వస్తుంది. వికారంగా ఉండడం, ఆకలి సరిగా లేకపోవడం జరుగుతుంది. కొందరికి చర్మంపై దద్దుర్లు ఏర్పడుతుంటాయి. ఎండ తీవ్రతకు తీవ్ర అనారోగ్యానికి గురైన వారు పలు సమస్యలతో ఆస్పత్రులకు వస్తుంటారు. ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలి. ముఖ్యంగా దీర్ఘకాలిక రోగులు, గర్భిణులు, బాలింతలు వీలైనంత వరకు ఎండకు దూరంగా ఉండాలి. ఎక్కువగా మంచినీరు, కొబ్బరి బొండాలు వంటివి తాగాలి. కారం పదార్థాలు తీసుకోరాదు. – డాక్టర్ డి. నీలిమారాణి, తగరంపూడి పీహెచ్‌సీ

అప్పుడే వాతావరణ చల్లదనం



జూలై, ఆగస్ట్ నెలలో కురవాల్సిన వర్షాలు ఈ ఏడాది ముందుగా కురిశాయి. అందువల్ల వాతావరణ పరిస్థితుల ప్రకారం ఎండలు అధికంగా ఉంటున్నాయి. త్వరలో అల్పపీడనం ఏర్పడే అవకాశాలు ఉన్నాయి. అప్పుడు కురిసిన వర్షాలు వల్ల మాత్రమే వాతావరణం చల్లబడుతుంది. రైతుల నారుమడులు ఎండిపోయే అవకాశాలు లేవు.

– డాక్టర్ వి. గౌరీ, శాస్త్రవేత్త, వాతావరణ విభాగం, అనకాపల్లి

అక్రమంగా మట్టి తరలింపు



మునగపాకలో ట్రాక్టర్లపై మట్టి తరలిస్తున్న దృశ్యం

మునగపాక: ఎటువంటి అనుమతులు లేకుండా మట్టి తరలిస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు. మునగపాక కృష్ణంరాజు కాలువపై నూతనంగా బ్రిడ్జి నిర్మాణంలో భాగంగా తవ్వేసిన మట్టిని ఆదివారం కొంతమంది అక్రమార్కులు ఎటువంటి అనుమతులు లేకుండా తరలించుకుపోవడం విమర్శలకు తావిస్తోంది. పట్టపగలే యథేచ్ఛగా మట్టి తరలిస్తున్నా అధికారులు పట్టించుకోవడం లేదన్న ఆరోపణలు ఉన్నాయి. ఉన్నతాధికారులు స్పందించి మట్టి అక్రమ తరలింపు జరగకుండా చూడాలని కోరుతున్నారు.

పారిశుధ్య కార్మికుడికి సన్మానం



పారిశుధ్య కార్మికుడు బండి ఆనంద్, బర్రమ్మ దంపతులను సత్కరిస్తున్న భరత్‌కుమార్

అనకాపల్లి: జీవీఎంసీ పారిశుధ్య కార్మికునిగా సేవలందిస్తూ పట్టణంలో అనేక సేవా కార్యక్రమాల్లో పాలుపంచుకుంటున్న బండి ఆనంద్ అభినందనీయుడని వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ సమన్వయకర్త మలసాల భరత్‌కుమార్ తెలిపారు. బండి ఆనంద్ పదవీ విరమణ సందర్భంగా పట్టణంలో డాక్టర్ బీఆర్.అంబేడ్కర్ సేవా సంఘం ఆధ్వర్యంలో సన్మాన కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఆనంద్, బర్రమ్మ దంపతులను దుశ్శాలువాలతో సత్కరించారు. ఈ సందర్భంగా భరత్‌కుమార్ మాట్లాడుతూ అందరూ ఆరోగ్యంగా ఉండాలనే లక్ష్యంతో పారిశుధ్య పనులను చేయడం అందరికి సాధ్యం కాదన్నారు. కాబట్టి వారిని సమాజం మరింత గౌరవించాలన్నారు. ఈ కార్యక్రమంలో పట్టణ అధ్యక్షుడు మందపాటి జానకీరామరాజు, నియోజకవర్గ యువజన విభాగం అధ్యక్షుడు జాజుల రమేష్, పట్టణ యువజన విభాగం అధ్యక్షుడు వేగి త్రినాథ్, ఎన్టీఆర్ ఆస్పత్రి మాజీ డైరెక్టర్ మూనూరు శ్రీను, పార్టీ నాయకులు, పారిశుధ్య కార్మికులు పాల్గొన్నారు.

చల్లగా చూడు తల్లీ..

వైభవంగా యానాద్రి అమ్మవారి జాతర

యలమంచిలి రూరల్: అమ్మా..యానాద్రమ్మా.. మాకే కష్టం రాకుండా చల్లగా చూడు తల్లీ.. అంటూ భక్తులు తమ మొక్కులు తీర్చుకుని అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. ఆషాఢ మాసం చివరి ఆదివారం ఏటా యానాద్రి అమ్మవారి జాతర నిర్వహించడం ఆనవాయితీగా వస్తోంది. పట్టణంలోని అల్లూరి సీతారామరాజు కాలనీలో అమ్మవారి జాతర వైభవంగా నిర్వహించారు. వేకువజాము నుంచే అమ్మవారికి పూజలు చేసేందుకు భక్తులు బారులు తీరారు. మహిళలు అమ్మవారికి చీర, రవికెలు, నల్లపూసలు, గాజులు సమర్పించి పసుపుకుంకుమలతో పూజలు చేశారు. స్థానిక ఎమ్మెల్యే సుందరపు విజయ్‌కుమార్ సహా పలువురు ప్రజాప్రతినిధులు, రాజకీయ పార్టీల నాయకులు అమ్మవారిని దర్శించుకున్నారు. ఆలయ కమిటీ భక్తులకు ఉచిత ప్రసాద వితరణ చేసింది. సాయంత్రం నేలవేషాలు, కోలాట ప్రదర్శనలు, రాత్రి వరకూ ఉర్రూతలూగించే సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. పెద్ద ఎత్తున బాణసంచా కాల్చారు. బంధుమిత్రుల రాకతో అల్లూరి సీతారామరాజు కాలనీలో సందడి నెలకొంది.